యూనిట్ IV

# 14. ధర్మదీక్ష

## చదవండి - ఆలోచించండి - చెప్పండి

– పిలకా గణపతిశాస్త్రి

వారణాసిని బ్రహ్మదత్తుడు పరిపాలిస్తున్నప్పుడు బోధిసత్త్వుడు ఐదువందల మంది శిష్యులతో హిమాలయాల్లో ఉండేవాడు. ఒకసారి ఎండలు బాగా కాసి అన్నిచోట్లా నీరు ఎండిపోయింది. జంతువులు నీళ్ళు దొరక్క అల్లాడిపోయాయి. శిష్యులలో ఒకడు వాటి దప్పిక తీర్చడంకోసం ఒక తొట్టి తయారుచేసి, దూరంగా ఉన్న నీళ్ళను తెచ్చి ఆ తొట్టెలో పోసేవాడు. జంతువులు గుంపులుగుంపులుగా వచ్చి ఆ నీరు తాగుతుండటంతో శిష్యుడికి పండ్లు తెచ్చుకోవడానికి గూడా తీరిక చిక్కలేదు. తనేమీ తినకుండానే ఆ జంతువులకు నీళ్ళుపోసేవాడు. ఇది చూసి జంతువులన్నీ మోయగలిగినన్ని పళ్ళుతెచ్చి ఇతనికివ్వాలని నిర్ణయించుకుంటాయి. అవన్నీ కలిపితే రెండువందల యాభై బండ్లు నిండాయి. వాటిని అక్కడి ఐదువందలమంది శిష్యులు తృప్తిగా తినేవాళ్ళు.

### ప్రశ్నలు

1. జంతువులు ఎందుకు అల్లాడిపోయాయి?
2. వాటి బాధ ఎలా తీరింది?
3. ఈ కథ ద్వారా మీరు గ్రహించిందేమిటి?
4. జీవకారుణ్యం అంటే ఏమిటి?
5. కర్తవ్యనిర్వహణ అంటే మీరేమని భావిస్తున్నారు?

© SCERT not to be republished

### ఉద్దేశం

పిల్లల్లో సున్నితత్వ భావన పెంపొందించి అన్ని ప్రాణులనూ జాలితో, దయతో చూడాలనే ఆలోచన పెంపొందింపచేయడం, ఎవరిపని వాళ్ళు సక్రమంగా చేస్తే సత్ఫలితాలు వాటంతట అవే వస్తాయని చెప్పడం ఈ పాఠం ఉద్దేశం.

ఈ పాఠం పిలకా గణపతిశాస్త్రి గారు రాసిన 'ప్రాచీనగాథాలహరి' అనే పుస్తకంలోనిది.

### విద్యార్థులకు సూచనలు

1. పాఠం చదవండి. తెలియని పదాలకు అర్థాలను తెలుసుకోండి.
2. చిత్రాలను చూసి, సందర్భాన్ని అనుసరించి, ఆలోచించి భావాన్ని గ్రహించండి.
3. పాఠంలో తెలియని విషయాలు గాని, తెలుసుకోవలసిన అంశాలు గాని మీ ఉపాధ్యాయుడితో చర్చించండి, తెలుసుకోండి.

**ఆ**వుదూడ 'అంబా' అని గొంతెత్తి అరిచింది! గోధూళివేళ అయ్యేసరికి ఆళవీగ్రామంలో నందగోపాలుని ఆలమంద అంతా తిరిగి వచ్చి వేసింది. కాని ఒకే ఒక్క ఆవు తిరిగి రాలేదు.

బాగా చీకటి పడింది. అయినా ఇంకా ఆవు తిరిగి రాలేదు. గోశాలలో గోవత్సాలన్నీ తోక లెత్తిపెట్టి ఎంతో సంతోషంగా పాలు కుడుచుకుంటున్నాయి. కాని ఆ ఒక్క ఆవుదూడ మాత్రం 'అంబా' 'అంబా' అని అదేపనిగా అరవడం మొదలు పెట్టింది. ఆ దూడ పుట్టినప్పటి నుంచీ నందగోపాలుని ఇల్లంతా పాడి పంటలతో కలకలలాడింది.

అందుచేత ఆ ఆవన్నా, ఆ దూడన్నా నందగోపాలుని కెంతో ఇష్టం. అది అదే పనిగా అరవడం మొదలుపెట్టేసరికి అతని కారాత్రి మరి అన్నం సయించలేదు. రాత్రి తెల్లవార్లూ నందగోపుడు అదేమైపోయిందో అని ఆరాటపడుతూనే ఉన్నాడు.

మరునాడు తెల్లవారగట్లే లేచి, ఆవును వెదకి పట్టుకోవడంకోసం ఆళవీ గ్రామానికి సమీపంలో ఉన్న అడవికి బయలుదేరి వెళ్లాడు.

నందుడూరి పొలిమేర సమీపించేసరికి పొద్దుపొడిచింది. పొరుగూళ్ళజనం తీర్థ ప్రజలాగ ఆళవీగ్రామానికి నడిచి వస్తున్నారు. కాని నందు డొక్కడు మాత్రం గ్రామ సమీపంలో ఉన్న అడవికి బయలుదేరి పోతున్నాడు!



ఆ ప్రజానీకం ముఖాలన్నీ అరుణోదయకాంతులలో నూతనానందావేశాలతో కలకలలాడుతున్నాయి. చిన్న చిన్న పసిపాపలను కూడా వెంటబెట్టుకొని వారంతా ఎక్కడికి వెడుతున్నారో అని నందుని హృదయాంతరాళంలో జిజ్ఞాస రేకెత్తింది. నడవలేక నడవలేక నడుస్తున్న ఓ ముసలితాత దగ్గరికి వెళ్ళి నెమ్మదిగా అడిగాడు.

"ఎక్కడికి తాతా! ఈ ప్రయాణం!"

"ఆళవికి పోతున్నాను బాబూ!"

"ఏమిటి విశేషం!"

"నీకింకా తెలియదా?"

"నాకేమీ తెలియదే!"

"ఈవేళ ఉదయమే గౌతమబుద్ధులు ఆళవికి విచ్చేస్తున్నారట! ఆ మహాత్ముణ్ణి ఒక్కసారి కళ్లారా సందర్శించి వత్తామని బయలుదేరాను. తిరిగీ ఈ జన్మలో మరి ఆయన సందర్శన భాగ్యం కలుగుతుందో! కలగదో!" అని ఆ వృద్ధుడొక పెద్ద నిట్టూర్పు విడిచి పెట్టాడు. నందగోపుడతనిని మళ్ళీ అడిగాడు.

"వారీవేళంతా ఆళవిలోనే ఉంటారా?"

"మధ్యాహ్న భిక్ష ముగించుకొని వెంటనే తిరిగీ శ్రావస్తీ నగరానికి వెళ్ళిపోతారట!"

©SCERT not to be republished

"అయ్యో! అలాగా!" అని నందగోపుడు తిరిగీ నిట్టూర్పు విడిచిపెట్టాడు. ముసలితాత అతని వాలకం చూచి ఇలా గడిగాడు.

"మీదేవూరు నాయనా?"

"ఆళవీ గ్రామమే!"

"అలాగా! అయితే పొరుగూళ్ళ జనం అంతా తీర్థ ప్రజలాగ ఇక్కడికే వస్తూంటే నీవు ఉన్న గ్రామం విడిచిపెట్టి పోతావేమయ్యా!" అని ఒక చిరునవ్వు విసిరాడా ముసలితాత. నందుడతనికి తన ప్రయాణ కారణం తెలియజేశాడు. అడవిలో ఆ ఆవు ఏ పులివాత పడిందోనని భయపడుతున్నానని కూడా అన్నాడు. ఆ మాట విన్న తరువాత ముసలి తాత మరి అతని మాట కద్దు చెప్పలేక తన దారిని వెళ్ళిపోయాడు. అతని వెంట ఇంకా ఎందరెందరో పరిసర గ్రామస్థులు ఆళవీగ్రామం వైపు నడిచి వెళ్ళారు.

అది చూడగానే నందగోపాలుని హృదయంలో ఆరాటం ప్రారంభమైంది. గోవు గొడవ విడిచిపెట్టి తాను కూడా వారి వెంటపడిపోవాలని అనుకున్నాడు. ఇక ఈ సమయంలో కాకపోతే మరింక తథాగతుని దర్శన భాగ్యమే కలగదేమోనని అతనికొక భయం పట్టుకుంది. వెంటనే వెనక్కి తిరిగి రెండు మూడడుగులు వేశాడు.

అంతలో అతని హృదయంలో లేగ దూడ 'అంబా' అని అరిచినట్టయింది. ఆవు ఒంటరిగా అడవిలో పులివాత పడిపోతున్నట్టు కనబడింది! 'అంబా' అని గుండె పగిలిపోయేటట్టరిచినట్టు వినబడింది!

అది నందగోపాలుని ఇంట పుట్టిన ఆవు. క్రమంగా అతని పాపలతో బాటే పెరిగి పెద్దదయింది. అతని పాపలందరు ఆ ఆవుపాలు తాగి క్రమంగా పెరిగి పెద్ద వారైనారు. నందుడు కూడా క్రమక్రమంగా వారితోబాటే ఆ ఆవు పాలు తాగి పెద్దవాడైనాడు.

ఇటీవల ఆ ఆవుకొక కోడెదూడ పుట్టింది. అంతవరకు పుట్టినవన్నీ పెయ్యదూడలే. కోడె పుట్టిన వేళా విశేషమేమో గాని ఆనాటినించీ నందగోపుని ఇల్లంతా పసిపాప నవ్వులతో కలకలలాడింది. అతని గుండెలో మళ్ళీ ఆ లేగ దూడ 'అంబా' అని అరిచినట్లు వినబడింది!

నందగోపాలునికిక కాలుసాగలేదు. ముందుగా తొందర తొందరగా అడవికి వెళ్ళి ఆవును వెదికి పట్టుకొని ఆ తరువాతే గౌతమదేవుని సందర్శించవలెనని అనుకొన్నాడు. ఒకవేళ తాను తిరిగి వచ్చేసరికి తథాగతుడు గ్రామం విడిచి వెళ్ళిపోతే! ఇక మళ్ళీ ఆయన ధర్మ ప్రసంగం వినే అదృష్టమే కలుగదేమోనని నందగోపాలుని కెంతో భయం వేసింది. తాను చేసుకున్న పూర్వపుణ్యం అంతే అనుకుని ఒక్క వేడి నిట్టూర్పు విడిచిపెట్టాడు. తొందర తొందరగా ఆవును వెదికి పట్టుకుని తిరిగి వచ్చి, అధమపక్షం గౌతమదేవుని దర్శనభాగ్యమైనా పొందవలెనని సంకల్పించాడు. బాగా తొందరగా అంగలు వేసుకుంటూ అడవిలోకి వెళ్ళిపోయాడు.

నందగోపుడావుకోసం అడవి అంతా గాలించేసరికి మిట్ట మధ్యాహ్నం అయింది. ఎండ నెత్తి మాడ్చివేస్తూంది. లోలోపల ఆకలి దహించి వేస్తూంది. నాలుక పిడచ గట్టుకుపోతూంది. అయినా నందుడు తన పట్టు విడువలేదు.

అంతలో అడవిలో ఎక్కడో మారుమూలగా ఒక ఆర్తనాదం వినబడింది. నందునికది ఆవు 'అంబా' అని పిలిచిన పిలుపులాగే స్ఫురించింది. గబగబా చెట్లు, పుట్టలు దాటి ఆ పిలుపు వినిపించిన ప్రదేశానికి చేరుకొన్నాడు. అక్కడ హఠాత్తుగా అతనికొక పెన్నిధి కనిపించినట్టయింది!

© SCERT not to be republished

అది నందుడు చిన్నప్పటినించీ పెంచి పెద్ద చేసిన ఆవు! అడవిలో దారితప్పి ఎటో పడిపోతూ మాటి మాటికీ 'అంబా-అంబా' అని అరుస్తూంది. ఏ పెద్ద పులినో చూచి బెదిరిపోయి కంగారుగా పరుగెత్తి ఉండవచ్చుననీ, అందువల్లనే అడవిలో దారి తప్పి తికమకలు పడుతూ ఉండవచ్చుననీ నందగోపాలకుడూహించాడు. వెంటనే దాన్ని వెంటబెట్టుకుని ఇంటికి బయలుదేరాడు.

ఆవుతోబాటతడు గ్రామం పొలిమేర చేరుకునేసరికి మిట్టమధ్యాహ్నం దాటిపోయింది. ఎంతో ఆలస్యం అయిందని నందుడిక ఇంటికి చేరుకునే సంకల్పం విరమించుకొన్నాడు. తొందర తొందరగా నడిచి వెళ్ళి బుద్ధదేవుని ధర్మబోధ వినవలెనని అనుకొన్నాడు. ఆ అదృష్టం కలిసి రాకపోతే పోనీ అధమం ఒక్కసారి కళ్ళారా ఆ మహామహుని సందర్శన భాగ్యమైనా పొందవలెనని ఉవ్విళ్ళూరిపోతూ గౌతమదేవుడు శిష్యగణంతో విశ్రమించిన వటవృక్షంవైపు సాగిపోయాడు. గోవు కూడా అతని వెంట ఒక చిన్న లేగదూడలా నడిచిపోయింది.

## 2

ఆనాడాళవీ గ్రామంలో అరుణోదయ కాంతులు, కాషాయంబరధారులైన బౌద్ధ భిక్షుక సమూహాలు ఒకేసారిగా ప్రత్యక్షమైనాయి. ఆ భిక్షువులతో గౌతమదేవుని ముఖజ్యోతి అప్పుడప్పుడే ఉదయిస్తున్న భానుబింబంలా మెరిసింది.

అది చూసి ఆళవీ గ్రామస్థులందరు భిక్షువులందరికీ ఎదురేగి అతిథి సత్కారాలతో ఎంతో ఆప్యాయంగా ఆదరించారు. విశాల వటవృక్ష చ్ఛాయల్లో వారందరికీ విడుదులేర్పాటు చేశారు.

తరవాత క్రమక్రమంగా భిక్షాసమయం ఆసన్నమయింది. భిక్షుకులందరు తమతమ భిక్షాపాత్రలు ధరించి ఆళవీ గ్రామంలో ప్రవేశించారు. కాని గ్రామస్థులెవ్వరు దాని కనుమతించలేదు. తామంతా ప్రత్యేకంగా వారికి విందు చేయబోతున్నామనీ, ఆ విందారగించవలసిందనీ పరిపరివిధాల ప్రాధేయపడ్డారు. భిక్షువులు మొదట తమ భిక్షాధర్మం విసర్జించడానికంగీకరించలేదు గాని చిట్ట చివరికి ఆచార్యదేవుని అనుజ్ఞపై ఆ విందు భోజనానికంగీకరించారు.

కొంతసేపటికి శ్రమణకులందరూ భోజనాలు ముగించుకొని ప్రశాంత వట తరుచ్ఛాయలో సమాసీనులైనారు. అప్పటి కించుమించుగా రెండు యామాలకాలం గడిచిపోయింది. తథాగతుడు వటవృక్ష మూలంలో అమర్చిన సుఖాసనంపై విశ్రమించి ఎవరికోసమో ఎదురుచూస్తున్నట్లుగా ఆళవీగ్రామం పొలిమేరల వైపవలోకిస్తున్నాడు.

**శ్రమణకులు**

బౌద్ధ ధర్మాన్ని పాటిస్తూ బుద్ధుడి శిష్యులుగా ఉండేవారు.

భోజనానంతరం ఆయన చేసే ధర్మబోధలాలకించవలెననే ఆసక్తితో ఆళవీ గ్రామస్థులందరూ అక్కడికి చేరుకొన్నారు. ఇంకా పరిసర గ్రామాలనించి వచ్చిన వారెందరెందరో ఆ ధర్మబోధలాలకింపవలెనని ఉత్కంఠతో తహతహలాడిపోతున్నారు. కాని వారందరికి బుద్ధదేవుని ముఖంలో కేవలం ప్రశాంత మౌనముద్ర మాత్రమే ప్రత్యక్షమైంది. అలా ఎంతసేపు వేచి ఉన్నా ఒక్క పలుకైనా ఆయన నోటినుంచి వెలువడలేదు.

క్రమక్రమంగా మూడో యామం కూడా గడిచిపోయింది. గౌతమ దేవుని విశాల నేత్రాలప్పుడెవరికోసమో నిరీక్షిస్తున్నట్టుగా స్ఫురిస్తున్నాయి. ఆ నిరీక్షణ తాత్పర్యమేమో ఎవరికీ అవగాహన కాలేదు. కొందరు భిక్షుకుల కదేమీ బోధపడక ఆచార్యునివలెనే తాము కూడా దిక్కులు చూడడం మొదలుపెట్టారు. కాని ఎంతసేపటికీ ఏమీ ఫలితం కలగలేదు.

© SCERT not to be republished

అంతట అనతిదూరంలో గంభీరంగా ఒక 'అంబా' రవం వినిపించింది. అందరు అటువైపు చూచారు. గౌతమబుద్ధుని నేత్రాలంతకుపూర్వంనుంచి ఆ వైపే పరికిస్తున్నాయి.

అంతలో గోవును వెంటబెట్టుకుని తొందర తొందరగా అంగలు వేసుకుంటూ వస్తున్న నందగోపాలుడనతి దూరంలో ప్రత్యక్షమైనాడు. కాని భిక్షువు లెవరూ అతని వైపంత ఆత్రంగా పరిశీలించలేదు. అయితే గౌతముని నేత్రాలు నిశ్చలంగా అతని ఆగమనమే నిరీక్షిస్తున్నట్లున్నాయి. దాని కారణమేమో వారెవరికీ బోధపడలేదు.

నందుడంతలో గోవును వటవృక్షచ్ఛాయలో నిలిపి నురుగులు గక్కుకుంటూ పరుగెత్తుకు వచ్చి బుద్ధదేవుని పాదాలపై సాగిలపడ్డాడు. కొంతసేపటికి లేచి అతివినయంగా దోసిలి ఒగ్గి నిలబడ్డాడు. చివరికెలాగైనా దర్శన భాగ్యమైనా లభించింది గదా! అని ఎంతో సంతోషించాడు. వెంటనే గౌతముడు లేచి నిలబడ్డాడు. వెనువెంటనే భిక్షువులందరు లేచి నిలుచున్నారు! బుద్ధదేవుడెంతో ఆత్రంగా పక్కనే నిలబడిన భిక్షువులతో

"ఇంకా భోజన పదార్థాలేమైనా మిగిలి ఉన్నాయా?" అన్నాడు.

భిక్షువులు "లేకేమి? సమృద్ధిగానే ఉన్నాయి" అన్నారు.

"అయితే వెంటనే ఆ నందగోపునికి తృప్తిదీరా భోజనం పెట్టించండి! తొందరగా వెళ్ళండి!" అన్నాడు.

వెంటనే కొందరు భిక్షువులు నందగోపాలకుని వెంటబెట్టుకొని భోజనశాలలోకి వెళ్ళిపోయారు. నందగోపునికి అన్నం కంటబడగానే పంచప్రాణాలూ లేచివచ్చాయి. గతరాత్రినించీ ఆ క్షణంవరకు అతడాకటితో నకనకలాడుతున్నాడు. ఆకలితో నవనాడులు కుంగిపోతున్నాయి. అయినా ఆ అన్నం చూచేసరికి అతనికి ఇంటి దగ్గర కట్టివేసిన ఆవుదూడ జ్ఞాపకం వచ్చింది. అక్కడికతని ఇల్లు కొంచెం దగ్గరలోనే ఉంది.

ఇక అతని కా అన్నంమీద దృష్టిపోలేదు. అంతలో ఇంటిదగ్గర లేగదూడ 'అంబా' అని గొంతెత్తి అరిచింది. అది వినగానే మర్రి నీడ కింద నిలబడిన నందగోపుని గోవంతకన్నా గట్టిగా అరిచింది. నందగోపుడన్నం తినకుండా లేచి నిలుచున్నాడు. కాని అతని కెదురుగా గౌతమ బుద్ధుడు నిలబడి చిన్న చిరునవ్వు చిందిస్తూ ఇలా అన్నాడు.

"నాయనా! నీ లేగదూడ పలుపు తెంచుకుని మర్రినీడలో నిలబడిన తల్లిదగ్గరికి వచ్చి తనివితీరా పాలు కుడుచుకుంటున్నది. తొందరలేదులే! నెమ్మదిగా భోజనం చెయ్యి!" అన్నాడు. గౌతముడు వటచ్ఛాయ విడిచిపెట్టి భోజనశాలలో ప్రవేశించినట్లంతవరకు నందగోపుడు గమనించనేలేదు. ఆయన స్వయంగా అక్కడికి వచ్చి నందగోపునికి కావలసిన భోజన పదార్థాలన్నీ వడ్డింపజేస్తున్నాడు. ఆ ఆప్యాయత చూసేసరికి నందగోపుని హృదయం ద్రవించి నీరైపోయింది.



తథాగతుడు నందగోపుని భోజనం పూర్తి అయ్యేవరకు అతని ప్రక్కనే కూర్చున్నాడు. ఎంతో ఆప్యాయంగా అతని గోవును గురించీ, కోడె దూడను గురించీ ఎన్నెన్నో కుశల ప్రశ్నలు వేశాడు. నందగోపుడు తన కోడెదూడ నుదుటిమీది నల్లని మచ్చలను గురించీ, ఒంటిమీది సుడులను గురించీ ఎవరికీ తెలియని రహస్యసాముద్రిక విషయాలెన్నెన్నో ఏ కరువు

©SCERT not to be republished

పెట్టాడు. ప్రత్యేకంగా వంశపారంపర్యతః గ్రహించిన కొన్ని గో సాముద్రిక రహస్యా లాచార్యదేవుని కెరుకపరిచాడు. ఆయన అవన్నీ విని తిరిగీ కొన్ని కొన్ని చిన్న సందేహాలు తీర్చవలసిందని అభ్యర్థించాడు. నందగోపుడెంతో చనువుతో అవన్నీ ఆచార్యదేవుని కుపదేశించాడు!

అంతేగాని నందగోపుని భోజనం ముగిసేవరకు ఆయన ధర్మబోధ లేమీ తల పెట్టనేలేదు. చుట్టూరా నిలిచిన కొందరు భిక్షువులకు వారి ప్రసంగాలన్నీ కేవలం ఇద్దరు గోపాలకుల ప్రసంగాలలా వినిపించాయి! వారంతా నోట మాటలేక అలాగే ఆ విడ్డూరమే తిలకిస్తూ నిలుచుండిపోయారు!

**3**

నందగోపుని భోజనానంతరం బుద్ధదేవుడతనిని వెంట బెట్టుకుని నెమ్మదిగా వట వృక్షచ్ఛాయకు తిరిగివచ్చాడు. వెంటనే అష్టాంగధర్మ ప్రవచనం ప్రారంభమైంది. అమృతవర్షప్రాయమైన ఆ ప్రసంగం ఆలకిస్తూ భిక్షువులు, ఆళవీ గ్రామస్థులు ఆనంద తరంగాలలో తలమునకలైనారు. ధర్మప్రవచనం చేస్తూన్నంతసేపు బుద్ధదేవుడు చిరునవ్వులతో నందగోపాలుని వైపలవోకగా తిలకిస్తూనే ఉన్నాడు.

అది చూసి బౌద్ధ భిక్షువులనేకులెంతో ఆశ్చర్యపడ్డారు. మరి కొందరిలో కొంచెం అసూయకూడా బయలుదేరింది. అయినా కొందరు ధర్మ ప్రవచనం ముగిసే వరకు ఎలాగో అలాగ నిగ్రహం అవలంబించారు. క్రమక్రమంగా కొంతసేపటి కా ధర్మప్రవచనం ముగిసిపోయింది. తరవాత బుద్ధదేవుడు నందగోపునికి ధర్మదీక్ష అనుగ్రహించాడు.

వెంటనే బౌద్ధ శ్రమణకులు, గౌతమ బుద్ధుడు శ్రావస్తీ నగరానికి ప్రయాణమైనారు.

దానితో అంతవరకు నిగ్రహం అవలంబించిన శ్రమణకులలో కొంచెం చలనం, కలకలం బయలుదేరాయి. మరికొందరు కొంచెం బిగ్గరగానే గుసగుసలు మొదలుపెట్టారు!

వారి గుసగుసలకు కొంచెం కారణం లేకపోలేదు. ఇన్నాళ్ళనించీ జరుగుతున్న ధర్మ ప్రసంగంలో గౌతమదేవుడు స్వయంగా ఎవరినీ భోజన విషయమై ప్రశ్నించి ఉండలేదు.

**అష్టాంగ ధర్మాలు**

1. సమ్యక్ దృష్టి
2. సమ్యక్ వాక్కు
3. సమ్యక్ కర్మ
4. సమ్యక్ సంకల్పం / లక్ష్యం
5. సమ్యక్ చేతన / మనస్తత్వం
6. సమ్యక్ జీవనం
7. సమ్యక్ వ్యాయామం
8. సమ్యక్ భావన

ఈనాడాయన ఎంతోసేపటినించి వేచిఉన్న భిక్షువులను, ఆళవీగ్రామస్థులను ఉపేక్షించి స్వయంగా దగ్గర కూర్చుని నందగోపునికి భోజనం ముగిసేదాకా ధర్మప్రవచనం ప్రారంభించనే లేదు. ఇక నందగోపుని విషయం చూస్తే అతడేమీ అంతటి గొప్పవాడు కాదు. వట్టి అమాయికుడు.

అలాంటి సామాన్యుని భోజన విషయంలో గౌతమదేవుని కంతటి పక్షపాతం కలగవలసిన అవసరమేమి కలిగింది?

వారి గుసగుసలావిధంగా సాగిపోయాయి. క్రమంగా అవి బుద్ధదేవునికి వినిపించే అంత బిగ్గరగా విజృంభించాయి.

ప్రశాంతంగా శ్రావస్తీనగరం వైపు సాగిపోతున్న సిద్ధార్థుడామాటలు విని మరి అడుగు వెయ్యకుండా అలాగే నిలబడి గుసగుసలాడుకొంటున్న శ్రమణకులవైపు చూశాడు. వారిలో ఒక శ్రమణకునితో ఆ గుసగుసలకు కారణమేమని ప్రశ్నించాడు. దానితో భిక్షువులందరు నిలబడిపోయారు. ఒక శ్రమణకుడాచార్యుని కాభిక్షువుల రహస్య సంభాషణలన్నీ తెలియజేశాడు.

© SCERT not to be republished

అవి విని సమ్యక్సంబుద్ధుడొక చిరునవ్వు నవ్వాడు. ఆ చిరునవ్వు చూసి భిక్షువులందరు నిర్ఘాంతపడి నిలుచున్నారు.

బుద్ధదేవుడతి ప్రశాంత స్వరంతో ఇలాగన్నాడు.

“నందగోపాలకుడు నిన్నటినించి ఎంతో క్షుధార్తుడై ఉన్నాడు. కనుకనే అతని కావిధంగా భోజనం పెట్టించాను. ‘క్షుధ’ యాతన లన్నింటిలోను అత్యంత దుస్సహమైన యాతన! జీవచైతన్యమే ఆ యాతనానిదానం! ఇది సమ్యగ్బుద్ధితో అవగాహన చేసుకొన్నవారందరికీ నిర్వాణం కరతలామలకం!”

అది వినగానే శ్రమణకులందరు పశ్చాత్తప్తులై వంచిన తలలింక ఎత్తలేదు. అంతలోనే గౌతముని గంభీరవాణి తిరిగి ప్రతిధ్వనించింది.

“నాయనా! నందగోపాలకుని సరళ వర్తనం, సాధుస్వభావం మీరెరగరు. ఎంతగా ఆకటి చిచ్చు వేధించినా అతడు తన గోపాలక ధర్మం విస్మరించలేదు! అతని గోవాత్సల్యం అపారం! ముప్ఫయి క్రోశాల దూరం నడిచి, ఇంతగా శ్రమపడి ఈ ఆళవీ గ్రామానికెందుకు వచ్చానో మీరెవరైనా ఎరుగుదురా?”

ఆ ప్రశ్నతో గుసగుసలాడిన శ్రమణక బృందం శిరస్సులింకా బాగా కిందికి వంగిపోయాయి.

‘ఆ నందగోపాలకుని కోసమే!’ అన్నాడు బుద్ధదేవుడు.

అది విని శ్రమణకులందరూ నందగోపాలకుని వైపెంతో గౌరవ భావంతో చూశారు. కొందరతనిని సమీపించి సవినయంగా చేతులెత్తి నమస్కరించారు.

గో, గోవత్సాలతో ఆళవీగ్రామం పొలిమేర వరకు బుద్ధదేవుని వెంట సాగిపోతున్న నందగోపాలుడాచార్యదేవుని మాటలు విని గౌతమదేవునికి, శ్రమణకులకు ఎంతో భయభక్తులతో సాగిలపడి, లేచి నిలబడి అమాయికంగా ఇలాగన్నాడు.

“బాబూ! నేనేమీ ఎరగని వట్టి అమాయికుణ్ని! అయితే ఆ మహారాజులు నాలాంటివారే! మందలో ఒక్క గోవు తప్పిపోయినా మరి వారికిక అన్నపానాలు సయించవు! వారి మనసు అప్పుడే తీసిన వెన్నపూసలాంటిది!”

ఆ అమాయిక ప్రసంగం వినగానే శ్రమణకులందరి ముఖాలలోనూ చిరునవ్వులు తాండవించాయి.

తరవాత నందగోపుడెంతో ఆప్యాయంగా లేగను దగ్గరకు తీసుకొని దాని నుదుటిపై ముద్దుల వర్షం కురిపించాడు. దాని మూలంగానే తనకంతటి అదృష్టం కలిగిందని లోలోపల ఎంతైనా మురిసిపోయాడు. అది అతని చేతి వేలొకసారి కుడుచుకొని గొంతెత్తి ‘అంబా’ అని అరిచింది.

©SCERT not to be republished

**కవి పరిచయం**



పిలకా గణపతిశాస్త్రి 1911 ఫిబ్రవరి 24న జన్మించారు. తూర్పుగోదావరి జిల్లాలోని కట్టుంగ వీరి స్వస్థలం. విజయనగరంలో విద్యనభ్యసించారు. సాహిత్యవిద్యా ప్రవీణ, ఉభయభాషా ప్రవీణ పూర్తిచేశారు. రత్నాపహారం వీరి తొలిరచన. మణిదీపిక, ప్రాచీనగాథాలహరి, విశాలనేత్రాలు, కాశ్మీర పట్టమహిషి, నాగమల్లిక, అందని చందమామ వీరి ఇతరరచనలు. సంస్కృతం, బెంగాలీభాషల నుంచి అనేక అనువాదాలు చేశారు. సరళమైన ఆలంకారిక శైలిలో వీరి రచన సాగింది.

## ఇవి చేయండి

## I. అవగాహన - ప్రతిస్పందన

### అ) కింది అంశాల గురించి తెలపండి.

1. ఈ కథను సొంతమాటల్లో చెప్పండి.
2. ఈ పాఠానికి 'ధర్మదీక్ష' అనే పేరు సరైందేనా?

### ఆ) కింది మాటలు ఎవరు ఎవరితో అన్నారు? ఎందుకన్నారు?

1. ఆళవికి పోతున్నాను బాబూ!
2. నీకింకా తెలియదా?
3. ఇంకా భోజనపదార్థాలేమైనా మిగిలి ఉన్నాయా?
4. ఆ నందగోపాలుని కోసమే!
5. బాబూ నేనేమీ ఎరగని వట్టి అమాయికుణ్ణి.

### ఇ) కింది పేరా చదవండి. ఖాళీలు వివరించండి.

కర్తవ్యం.... ప్రతి జీవీ పాటించితీరవలసిన నిష్ఠ. ఒక వానపాము ఎంత అల్పజీవి! మట్టిలో పుడుతుంది. మట్టి తింటుంది. మట్టిలో మరణిస్తుంది. మరెందుకు అది జన్మ తీసుకుంటుంది. విచిత్రమైన విషయం ఏమిటంటే మట్టే దాని జీవనాధారమూ, జీవితమూ. అయినా మట్టికీ దాని అవసరం ఉంది. అది మట్టిని తలకిందులు చేస్తుంది. గుల్లగుల్ల చేస్తుంది. గునపాలు చేయలేని ఆ సున్నితమైన వ్యవసాయాన్ని, సుకుమారమైన శరీరంతో శ్రద్ధగా అదే దాని జీవిత లక్ష్యం అన్నంత కర్తవ్యనిష్ఠతో చేస్తుంది. మనిషిమాత్రం అల్పజీవుల అవసరం ఏమిటన్న తేలికభావంతో ఉదాసీనత ప్రదర్శిస్తున్నాడు.

1. కర్తవ్యం అనగా ______________________
2. వానపాము జీవనాధారం ______________________
3. మనిషి ఉదాసీనత చూపించేది ______________________
4. పై పేరాకు శీర్షిక ______________________
5. పై పేరాలోని ముఖ్యమైన ఐదు పదాలు : ______________________

### ఈ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. నందగోపుడు ఆరాటపడటానికి కారణం ఏమిటి?
2. నందగోపునికి ఆ ఆవంటే ఎందుకంత ఇష్టం?
3. గ్రామస్థులు బౌద్ధభిక్షువులకు ఏయే ఏర్పాట్లు చేశారు?
4. గౌతమబుద్ధుడు నందగోపుణ్ణి ఏమేం అడిగాడు?
5. నందగోపుడు తన ధర్మాన్ని నిర్వర్తించాడని ఎలా చెప్పగలవు?



© SCERT not to be republished

## II వ్యక్తీకరణ- సృజనాత్మకత

### అ) కింది ప్రశ్నలకు ఐదు వాక్యాల్లో జవాబులు రాయండి.

1. 'గోధూళివేళ' అంటే ఏ సమయం? ఆ సమయంలో గ్రామంలో వాతావరణం ఎలా ఉంటుంది?
2. 'ప్రజానీకం ముఖాలన్నీ అరుణోదయ కాంతులతో, నూతనానందావేశాలతో కలకలలాడుతున్నాయి. ఈ వాక్యాన్ని మీ సొంత మాటలలో వివరించండి.
3. జిజ్ఞాస రేకెత్తడమంటే ఏమిటి? ఏ అంశాలపట్ల పిల్లలకు జిజ్ఞాస ఉంటుంది?
4. ఎదురేగి అతిథి సత్కారాలతో ఎవరెవరిని ఆప్యాయంగా పలకరిస్తారు?
5. బుద్ధుని ఆప్యాయతను చూసేసరికి నందగోపాలుడి హృదయం ద్రవించి నీరైపోయింది. "హృదయం ద్రవించి నీరైపోవడం" అంటే ఏమిటి? దీన్ని ఇంకా ఏయే సందర్భాలలో వాడతారు?

### ఆ) కింది ప్రశ్నలకు పది హేను వాక్యాలలో జవాబులు రాయండి.

1. నందగోపాలుడి గుణగణాలను వర్ణించండి.
2. గౌతమబుద్ధుడు నందగోపాలుడిపై వాత్సల్యాన్ని ఎలా చూపించాడు? దానికి కారణాలు ఏమిటి?
3. మానవులుగా పుట్టినందుకు మనం ఎవరిపట్ల, వేటిపట్ల మన కర్తవ్యాన్ని నిర్వహించాలి? ఎందుకని?

### ఇ) సృజనాత్మకంగా రాయండి.

ఇది ఎందుకూ పనికిరాదు. దీన్ని కబేళాకు తీసుకొనిపోండి- అన్న యజమాని మాటలకు ఆ ఎద్దు గుండె గుభేలుమంది. తన గంతులేసే బాల్యం, అప్పటి నుండి తన యజమానికి చేసిన సేవ గుర్తుకు వచ్చాయి. బాధగా మూలిగింది - ఇలాంటి ఎద్దు ఆత్మకథను ఊహించి రాయండి.

(లేదా)

ఈ రోజుల్లో కాలుష్యం, ఇతర కారణాలవల్ల కొన్ని పక్షులు, జంతువులు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడింది. వీటిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ కిందివాటిలో ఒకదాన్ని తయారుచేయండి.

i. పోస్టర్, ii. కరపత్రం, iii. ప్రసంగ పాఠం

### ఈ) ప్రశంసాత్మకంగా రాయండి.

ప్రజ్ఞ తొమ్మిదోతరగతి చదువుతున్నది. ఆమెకు పిచ్చుకలంటే మహా ప్రేమ. వాటికోసం ఆపార్టుమెంటు బాల్కనీలోనే కుండీల్లో చెట్లు పెంచింది. కొన్నాళ్ళకు ఆ పూలచెట్ల మధ్యే పిచ్చుకలు గూళ్ళు కట్టుకున్నాయి. గుడ్లుపెట్టాయి. పొదిగాయి. ప్రజ్ఞ గింజలు చల్లి, నీళ్లుపెట్టి వాటి ఆలనాపాలనా చూస్తుండేది.

ఆమె ప్రయత్నాన్ని అభినందిస్తూ పదివాక్యాలు రాయండి.

© SCERT not to be republished

## III. భాషాంశాలు

### పదజాలం

**అ) పేరా చదివి గీత గీసిన పదాలను ఏ అర్థంలో వాడారో రాయండి.**

నందగోపునికి అన్నం కంటపడగానే పంచప్రాణాలూ లేచివచ్చాయి. గతరాత్రినించీ ఆ క్షణం వరకూ అతడాకటితో నకనకలాడుతున్నాడు. ఆకలితో నవనాడులు కుంగిపోతున్నాయి.

1. పంచప్రాణాలూ లేచి రావడం, 2. ఆకలితో నకనకలాడటం, 3. నవనాడులు కుంగిపోవడం

**ఆ) కింది పదాలకు సమానార్థకాలు రాయండి**

1. గోధూళివేళ, 2. ఆలమంద, 3. తీర్థప్రజ, 4. గాలించు
5. విడిది, 6. ఉవ్విళ్లూరు, 7. అనతిదూరం

**ఇ) వాక్యాన్ని చదివి జాతీయాల అర్థాన్ని ఊహించి రాయండి.**

1. మీ ఆప్యాయతకు నా హృదయం కరిగినీరైపోయింది.
2. మేధావులందరూ చర్చలలో తలమునకలయ్యారు.
3. ఆవు అరుపు విన్నాక నందగోపాలుడికి బుద్ధుడి దగ్గరకు వెళ్ళడానికి కాలుసాగలేదు.

### వ్యాకరణం

**అ) కింది వానికి వ్యతిరేకార్థక వాక్యాలు రాయండి.**

1. ఒకే ఒక్క ఆవు తిరిగి రాలేదు.
2. రాత్రి తెల్లవార్లూ నందగోపుడు ఆరాటపడ్డాడు.
3. నందుడతనికి తన ప్రయాణ కారణం తెలియజేశాడు.
4. ఒక్క పలుకైనా ఆయన నోటినుండి వెలువడలేదు.

**ఆ) కిందివాటిని సంయుక్త వాక్యాలుగా రాయండి.**

1. బుద్ధదేవుడు వటవృక్షచ్ఛాయకు వచ్చాడు. వెంటనే అష్టాంగ ధర్మప్రవచనం ప్రారంభమైంది.
2. లేగ మూలంగా నందగోపునికి అదృష్టం కలిగింది. లేగదూడను నందగోపుడు ముద్దుపెట్టుకొన్నాడు.

**ఇ) విరామ చిహ్నాలు గుర్తించండి.**

నాయనా నందగోపాలకుని సరళ వర్తనం సాధుస్వభావం మీరెరుగరు ఎంతగా ఆకటి చిచ్చు వేధించినా అతడు తన గోపాలక ధర్మం విస్మరించలేదు అతని గోవాత్సల్యం అపారం ముప్పయి క్రోశాల దూరం నడిచి ఇంతగా శ్రమపడి ఈ ఆళవీ గ్రామానికెందుకు వచ్చానో మీరెవరైనా ఎరుగుదురా

**ఈ) పాఠంలోని పది సమాస పదాలను రాయండి. వాటికి విగ్రహవాక్యాలు రాయండి. ఏ సమాసమో తెలపండి.**


**ఉ) మీరు తెలుసుకొన్న అలంకారాలు ఏవి? ఈ పాఠంలో వాటికి సంబంధించిన ఉదాహరణలు ఉన్నాయా? వాటిని రాయండి. లేని వాటికి మీరే సొంతంగా రాయండి.**

**ప్రాజెక్టు పని**

పక్షులు, జంతువుల గొప్పదనాన్ని వివరించే గేయాలను/ కథలను సేకరించి తరగతి గదిలో చదివి వినిపించండి.

**సత్ప్రవర్తన వల్లనే దు:ఖం నశిస్తుంది.**
**సుఖం వృద్ధి చెందుతుంది. - బుద్ధుడు.**

© SCERT not to be republished




© SCERT not to be republished